# 10

## శాస్త్రి - రావు

రావుకు జాబు వచ్చింది. అందులో శాస్త్రి చనిపోయాడని ఉంది.

ఆ జాబు చూసుకుంటూ రావు అలాగే నిలబడిపోయాడు. ఉన్నట్టుండి అతడు, "శాస్త్రి కాదు చచ్చిపోత! నేనే పోయాను! రావే చచ్చిపోయాడు!" అంటూ కుర్చీలో కూలపడ్డాడు.

'శాస్త్రి' అంటే కామశాస్త్రి. 'రావు' అంటే కామేశ్వరరావు. ఇద్దరూ కామయ్యగారి మనుమలూ, పేరింటిగాళ్లూను. శాస్త్రి కొడుకు కొడుకు; రావు కూతురుకొడుకు. రావు కాకినాడలో పెరిగేడు. చిన్నప్పుడే క్రాపింగు పెట్టించా రతనికి. ఇంగ్లీషుబళ్ళో చేరిపించారు. హైస్కూల్లో ఉండగానే సంస్కార్ల కబుర్లు

వినపడే వతనికి. బాల్యవివాహాలు కూడదనీ, రజస్వలా నంతరవివాహాలే చెయ్యాలనీ, చిన్నపిల్లలకు ముసిలి వాళ్లను కట్టిపెట్టటం, వితంతువులకు మళ్లీ పెళ్ళిళ్లు చెయ్యక పోవటం అన్యాయాలనీ, అతడు పెళ్లి అంటే ఏమిటో సరిగా తెలియని యీడులోనే బ్రహ్మసమాజంవారి మీటింగుల్లో వింటూవచ్చాడు.

శాస్త్రికి మొదట్నుంచీ పిలకే ఉండేది. స్వగ్రామం రాజారం ఎలిమెంటరీస్కూల్లో ఉన్న చదువేదో చదివేశు. తర్వాత తాతతోటీ, తండ్రితోటీ పొలం వెళుతూండేవాడు. రావు శెలవుల్లో తాతగారింటికి వస్తూండేవాడు. శాస్త్రి పిలకను చూచి వేళాకోళం చేసేవాడు. శాస్త్రి ఏం మాటాడినా, 'పల్లెటూరి బైతువి, నీ కేం తెలుసు పోవోయ్?' అంటూండేవాడు. శాస్త్రికిమాత్రం కోపం వచ్చేదికాదు. రావుబావ నాగరీకుడనీ, సంస్కారి అనీ, తనకు యుక్తమని తోచినదల్లా నిర్భయంగా చేయగలడనీ, తనకుమల్లే పిరికివాడు కాడనీ అతణ్ణి మెచ్చుకుంటూండేవాడు. తాను ఎంత పిరికీ కాకపోతే, పిలకఐనా తీయించుకోలేక పోతాడా? తీయించేస్తే, తండ్రీ, తాతా కోప్పడతారన్న భయమే ఆయిరి!

శాస్త్రిచెల్లెల్ని రావు కిచ్చి, మేనరికం చేద్దామని అతని మేనమామ ఆశించాడు కాని రావు వప్పుకోలేదు. 'ఆరోగ్య శాస్త్రరీత్యా మేనరికం మాష్యం' అన్నాడు. అంతేగాకుండా తనచదువు పూర్తిఐ, ఉద్యోగంలో ప్రవేశించాకగాని పెళ్ళి మాట తలపెట్ట నన్నాడు. మేనల్లు డంత నిర్మొగమాటంగా

ఉన్నందుకు శాస్త్రితండ్రికి కోపం వచ్చింది కాని శాస్త్రికి కోపం రాలేదు. 'రావుబాన తనకు యుక్తమని తోచినదల్లా నిర్భయంగా చెప్పేస్తాడు!' శాస్త్రితండ్రి మరోసంబంధం చూసి పిల్లకి పెళ్ళిచేసేశాడు. శాస్త్రికి మేనరికం సిద్ధంగా ఉందిగనక చెల్లెలిపెళ్ళిలోనే అతని పెళ్ళికూడా ఐపోయింది.

రావు బి. ఏ. ప్యాసై నౌకరీలో ప్రవేశించాకే పెళ్లి చేసుకున్నాడు. అతడు చదువుకున్న చదువుకి కలెక్టరీ ఉద్యోగమైనా కాకపోతుందా అనుకునేవాడు శాస్త్రి. రావుకి కలెక్టరీ కాలేదుగాని కలెక్టరాఫీసులో గుమాస్తా అయింది.

రావుసంతానంలో మొదటిది ఆడపిల్లే. ఆమె పుట్టడంతోనే అందరూ 'లక్ష్మమ్మగారు పుట్టిం' దన్నారు కాని, రావు ఆమెకు తన తల్లిపేరు పెట్టలేదు.నాజూకుగా ఉంటుందని తోచి, 'సరోజిని' అని బియ్యంమీద రాసేశాడు. 'సరోజ' అని పిలిచేవారు. ఎదిగినకొద్దీ సరోజకి రోజాపువ్వుని కుండే సౌకుమార్యం, అందం వచ్చాయి. ఖర్చెక్కువైనా కాన్వెంటుచదువే మంచి దనిపించి రావు సరోజను కాన్వెంటులోనే చేర్పించాడు. పిల్ల చకచకా ఇంగ్లీషు మాట్లాడుతోంటే, బి. ఏ. ప్యాసైన తన కన్న బాగా మాట్లాడుతోందని మురిసిపోయేవాడు.

శాస్త్రికీ పిల్లలు పుట్టేరుకాని మొదటి ఇద్దరూ మగపిల్లలు. మూడోదే ఆడపిల్ల. సరోజకన్న నాలుగేళ్ళు చిన్నది. దానికి శాస్త్రి 'సుబ్బమ్మ' అని తల్లిపేరే పెట్టేడు.

శాస్త్రి సుబ్బమ్మకి ఎనిమిదోయేట పెళ్ళి నిశ్చయం చేసి, పిలుపుకోసం కాకినాడ వెళ్ళేడు. రావు, 'ఇంత చిన్న

తనంలో పిల్లకి పెళ్ళేమిటి?' అని శాస్త్రిని కూకలేశాడు. బాల్యవివాహాలవల్ల వచ్చే అనర్థాలన్నీ చెప్పేడు. 'పన్నెండేళ్లు వచ్చినా, సరోజకి నేను ఆ మాటే తలపెట్టటం లేదు చూడు" అన్నాడు. శాస్త్రి చిన్నబుచ్చుకుని ఇంటికొచ్చాడు. 'పెళ్లి చెయ్యటమా, మానటమా?' అన్న మీమాంసలో పడ్డాడు. కాని అక్కడంతా, 'ఏమిటి శాస్త్రీ, నీ కేమైనా పిచ్చిపట్టిందా? ఆ ఇంగ్లీషు మేను మాట పట్టుకుని, నిశ్చయమైన పెళ్ళి మానట మేమిటి?' అని చివాట్లు పెట్టేరు. అనుకున్న ముహూర్తానికి పెళ్ళి ఐపోయింది.

రావు పెళ్లికి వెళ్ళలేదు. భార్యనీ, పిల్లల్నీ కూడా పంప లేదు. 'పిల్లలు సరదాగా చూస్తారు. వెళ్ళొస్తాం పోనీ' అం దామె. బాల్యవివాహాలకు వెళ్ళరా దనేశాడు రావు.

ఆ మరుసటేడు శాస్త్రికి గొప్ప విపత్తు వచ్చింది.

పండుక్కి అత్తారింటి కొచ్చిన సుబ్బమ్మ మొగుడు పద్దాను గేళ్ళ కుఱ్ఱవాడు, ఈడుపిల్లలతో ఈతలకు వెళ్లి కాలు వలో మునిగిపోయాడు. అల్లుడి శవాన్నీ, కూతురి మొహాన్నీ చూచి, 'నే నేం పాపం చేశాను దేవుడా, నన్నిలా శిక్షించావు?' అని గుండెబాదుకుంటూ ఏడ్చేడు శాస్త్రి. ఒక్క శాస్త్రే కాదు, గ్రామం అశేషం ఏడ్చింది.

ఈ ఘోరవార్త విన్న రావు, భార్యతో "చూశావా, చెపుతే విన్నాడు కాదు" అన్నాడు. "ఇప్పు డామాట ఎందుకు? వెళ్ళి చూసిరండి" అన్న దామె.

పరామర్శకు వచ్చిన రావుని కౌగలించుకుని, శాస్త్రి,

"నువ్వు వద్దంటే వినక పెళ్ళి చేసి, ఇలా దీని గొంతుక కోసే శాను బావా!" అని వెక్కి వెక్కి ఏడ్చేడు. రావు కాకినాడ తిరిగి వెడుతూ, శాస్త్రితో, "సుబ్బమ్మకి మళ్ళీ పెళ్లి చెయ్యి" అన్నాడు. శాస్త్రి విస్తుపోయి, "అదెలా సాధ్యం! ఊళ్ళో వాళ్ళూ, బంధువులూ హర్షిస్తారా?" అన్నాడు. "అలాగని అన్నం పున్నం ఎరగని పిల్లని ఆజన్మాంతం విధవని చేసి కూచో పెడతావా?" అని కోప్పడ్డాడు. శాస్త్రి బదులు చెప్ప లేదు. రావు వెళ్లిపోయాడు.

కాలం గడుస్తోంది. రావు చెప్పిన మాట శాస్త్రిమనసులో మెదులుతోనే ఉంది. సుబ్బమ్మ కంటపడ్డప్పుడల్లా అతని కడుపు తరుక్కుపోతూ నేవుంది. "రావుబావ చెప్పినదే సరి. సుబ్బికి మళ్లీ పెళ్లి చేయటమే న్యాయం. కాని—" అక్కడితో ఆలోచన ఆగిపోయేది. ఏవేవో అభ్యంతరాలు కనబడేవి. కాని క్రమంగా కడుపుతీపి ఆ అభ్యంతరాలను ఎదుర్కొని, తలెత్తనివ్వలేదు. "ఊరివాళ్ళు వెలేస్తే కాపరం ఎత్తేద్దాం. బంధువులు హర్షించకపోతే రాకపోకలు మానుకుందాం" అని మనస్సు సమాధానపరుచుకున్నాడు. ఎవరితోటీ చెప్పకుండా, నాలుగూళ్ళూ తిరిగొచ్చి, సంబంధం రైటుచేసుకొచ్చాడు. పెళ్ళాన్నీ, పిల్లల్నీ రాజమండ్రీ తీసుకెళ్ళి పిల్లకి గప్‌చిప్‌గా పెళ్లిచేసి చక్కావచ్చాడు.

ఈ సంగతి తెలిసి, రావే ఆశ్చర్యపోయాడు. పండుగకి ఆ అల్లుడొచ్చేదాకా ఊళ్ళో ఎవరికీ సుబ్బమ్మ మళ్లీ పెళ్లి మాట తెలియనేలేదు. "ఎంతవాడు!" అన్నారంతా. అది

మెప్పో, దెప్పో తెలుసుకోటానికి శాస్త్రి కెంతో కాలం పట్ట లేదు. చైత్ర వైశాఖాలు: పెళ్ళిళ్ళకాలం వచ్చింది. డోలు సన్నాయిలతో పిలుపుకు వచ్చినవాళ్ళు శాస్త్రి గుమ్మంవైపు చూడకుండా పైగడపకు పోయేవారు. శాస్త్రి స్నేహితులు కొందరు, "మాకు పిలవాలనే ఉందిగాని భైరవభోట్లూ వాళ్లూ 'ససేమిరా, వల్లకా' దన్నారు. మేమేం చెయ్యం మరి?" అని నసిగేరు. శాస్త్రి భార్యకి, వెలివేశారంటే కష్టమే తోచింది. అది దుర్భరం కాక పూర్వమే అతడా ఊళ్ళోంచి బెజవాడకు మకాం ఎత్తేశాడు.

సరోజకి పద్ధానుగేళ్ళొచ్చాయి. 'పెద్ద మనిషి అయిం' దన్నారు. "ఇంక పెళ్లి సంబంధాలు చూడండి" అంది రావు భార్య. "స్కూలుఫైనలు ప్యాసవుతేనేకాని ఆమాట తలపెట్ట కూడ" దన్నాడు రావు.

సరోజ, 'అదెంతపని?' అన్నట్లు ఇట్టే స్కూలుఫైనలు ప్యాసయింది. రావు సంబంధాలు వెతకటం మొదలెట్టేడు. ఎక్కడా ఇరవైయేళ్ళ వరుడే దొరకలేదు! అన్నీ లేత మొహాలే. కులహీనమైనా పనికొస్తుందిగాని వరహీనం పనికి రాదుకదా! వెతికేడు, వెతికేడు; ఎవడో ఇరవైయేళ్ళవా డొకడు కనపడ్డాడు. కాని వాడికి చదువు ఫిఫ్తుఫారం ఫెయిల వటంతో పూర్తి ఐపోయింది. స్కూలుఫైనలు ఫ్యాసయిన పిల్లకి ఫిఫ్తుఫారం ఫెయిలైనవా డెలా పనికొస్తాడు? ఉహుఁ... మళ్లీ వెతకటం ప్రారంభించాడు. రెండో పెళ్ళివాళ్ళు కన పడ్డారు. అబ్బే, ఇంత గారవంగానూ పెంచి ఆఖరికి రెండో

పెళ్లివాణ్ణా?...కాలం గడిచింది. ఈలోపుగా సుబ్బమ్మకి శోభన మైంది. రావుభార్యకి తొందర ఎక్కువైంది. కనపడ్డవాణ్ణల్లా, 'మా సరోజకు సంబంధం చూసిపెట్టు' అని అడగటం మొద లెట్టింది. ఆఖరికి ఎవరో గుంటూరులో వున్న ఓ సంబంధం చూసిపెట్టేరు. ఇరవై రెండేళ్ళవాడుట. బి. ఏ. ప్యాసైనవాడు కూడాను. భూవసతికూడా చెప్పతగ్గదేనట. ఆ భోగట్టా తెలి యటంతోటే, ఒక్క నిముషంకూడా వృధాచెయ్యకుండా రావు గుంటూరు పరుగెత్తికెళ్ళేడు. ఇతగాడు ఇస్తానన్న కట్నం కానుకలకి వాళ్ళేమీ బేరమాడకుండా ఒప్పుకున్నారు. రావు నిశ్చయం చేసుకొచ్చి, భార్యతో, "మన అదృష్టంకొద్దీ, యీ వరుడు పెళ్లికాకుండా ఆగిపోయాడు" అన్నాడు. "ఎక్కడెక్కడి పెళ్లికొడుకుల్నీ ఏరేసి ముడిపెట్టేసే మన సంఘంలో ఈ ఒక్కడూ ఎందుకు మిగిలిపోయాడు?" అన్నసంగతే వాళ్ళాలో చించలేదు. సంబంధాలకోసం తిరిగితిరిగి, చెప్పు లరిగిపోయే టప్పటికి, మొదటి రోజుల్లో వుండే జాగ్రత్త క్రమంగా సడలి పోయింది.

సరోజకి వైభవంగా పెళ్ళిజరిగింది. శోభనం చేద్దా మనుకుంటూంటే పెళ్లికొడుక్కి ఉష్ణంతగిలిం దన్నారు. కార్యం అడ్డిపోయింది. "మునిగిపోయిందేమిటి? మరోముహూర్తానికి చేద్దాం" అన్నాడు రావు.

ముహూర్తం పెట్టి వాళ్ళే రాస్తారని ఊరుకున్నాడు రావు. కాని గుంటూరునుంచి వచ్చే ఉత్తరాల్లో, అల్లుడి కింకా టెంపరేచరు వస్తోనేవుందని తేలింది. 'ఏమిటి చెప్మా?'

అని ఓమాటు బయల్దేరివెళ్ళేడు రావు. అప్పుడు గుంటూరులో మెడికలాఫీసరు కృష్ణప్రసాదు. ఆయన రావు క్లాసుమేటు. ఆయనను తీసుకొచ్చి పరీక్షచేయించాడు. టి. బి. అని తేలింది. "ఇలా ముదరబెట్టేశారేమిటోయ్?" అన్నాడు ప్రసాదు. రావు గుండె గతుక్కుమంది. ఎప్పట్నుంచి ఇది? పెళ్లి కాకపూర్వం నుంచీ ఉందన్నమాటా? వియ్యాలవారిని నిలేసి అడిగేడు. "మాతుమాత్రం తెలుసునాండీ?" అన్నారు వారు. అతడు కోపంలో ఏదో అనబోతే, "పిల్లవాడి కెలా ఉంటుందో అని మేం బెంగెట్టుకునుంటే మధ్య మీ గొడవేమిటి?" అన్నారు.

రావు రెణ్ణెల్లు సెలవుపెట్టేడు. అల్లుణ్ణి మదనపల్లి శానిటోరియంలో చేర్పించి అక్కడ మకాంపెట్టేడు. కన్నవారి కన్న ఎక్కువ శ్రద్ధతోనూ, ఓపికతోనూ అల్లుడికి వైద్యం చేయించాడు. వెయ్యిరూపాయలు అప్పు అయింది. కాని, పాపం, మాటదక్కలేదు. పుట్టెడు దుఃఖంతో కాకినాడ వచ్చేశాడు.

పరామర్శకొచ్చిన అమ్మలక్కలలో కొందరు తప్పంతా మొగపెళ్ళివారిదే అన్నారు.

"అంతరోగం పెట్టుకుని పెళ్లిచేయట మేమిటి, వాళ్ళ దుర్మార్గం కాకపోతే?" అంది ఒకామె. ఇవతలకొచ్చాక, ఆమెకు సమాధానంగా మరొకావిడ, "రోగమైతే పెళ్ళి మానుకుంటారుటో? ఆడదాని మంగళసూత్రబలం మంచిదైతే, మంచంపట్టిన మొగుడు ఇట్టే లేచి తిరుగుతాడు!" అనేసి, సరోజలోకూడా తప్పు లేకపోలేదన్నట్లు తేల్చింది.

శాస్త్రి కీ దుర్వార్త తెలీటంతోనే తెక్కలుకట్టుకొచ్చి వాలేదు. తక్కినవాళ్ళకుమల్లే వెంటనే వెళ్ళిపోకుండా ఓ పదిరోజులు ఆగేడు; ఆ కబురూ ఈ కబురూ చెపుతో, రావు దుఃఖం శమించేటందుకు పాటుపడ్డాడు.

శాస్త్రీ, రావూ కలుసుకుని చాలాకాలమైంది. సుబ్బమ్మ మొదటిభర్త చనిపోయినప్పుడు కలుసుకోవడమే. సరోజ పెళ్లికీకూడా శాస్త్రి రాలేదు. రాకపోవటానికి కారణం చెప్పకుంటూ దరిమిలాన ఉత్తరం రాశాడు. "బంధువులంతా నన్ను వెలేశారు. సంస్కారివి గనక నువ్వు లక్ష్యపెట్టవుగాని, పెళ్లికొచ్చినవాళ్లంతా నన్ను చూసి సణుగుతారు. అందుకు రాలేదు. మరోలా అనుకోకు" అని రాశాడు. ఆ ఉత్తరం తరవాత వాళ్ళు జాబులుకూడా రాసుకోలేదు. అంచేత ఇప్పుడు కలుసుకుమాట్లాడుకోడంలోచాలాసంగతులు వెళ్ళేయి.

" 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్నట్లు, రాజారంనుంచి మకాం ఎత్తెయ్యటం చాలా ఇబ్బందిగానే ఉందనుకో. కాని అవసరం... బెజవాడ మకాం బాగానే ఉంది. నా జోలీ, శొంఠీ ఎవరికీ అక్కర్లేదు. ఎటొచ్చీ అన్నీ కొనుక్కోవాలి. అంతేకాకుండా నా కక్కడ ఏమీ వృత్తి లేదు. కాస్త ఇంగ్లీషు చదువుకుని, లెక్కా డొక్కా నేర్చిన వాణ్ణి కానుగదా...ఏమైనా ఇప్పట్లో ఏ సమస్యా లేదులే. శేషిపెళ్లి మళ్ళీయేట చెయ్యాలి. మన శాఖలో ఆశ లేదు. పై శాఖలలో ఛాన్సు ఎలా ఉంటుందో మరి..."

శాస్త్రి వెడుతూ వెడుతూ "సరోజకి మళ్ళీపెళ్లి చేసెయ్

సుమా'' అని రావుతో చెప్పలేదు. రావు మొదట్నుంచీకూడా సంసారి; సర్వం తెలిసినవాడు; ఎలాగా చేస్తాడు; తాను చెప్పే దేమిటి?

ఆయేడే సుబ్బమ్మకి కొడుకు పుట్టేడు. మరో ఆర్నెల్లకి శేషమ్మకి పెళ్ళిసంబంధాలు చూచారు. స్వశాఖ వెలనాట్లలోనే వరుడొకడు కనపడ్డాడు కాని శేషికి అతడు నచ్చలేదు. శేషితల్లి, ''నచ్చలేదంటే ఎలాగే? మన్ని వెలేశారు తెలుసా? నిన్ను పెళ్లిచేసుకుంటానంటూ రావటమే చాలు. వద్దంటే పెళ్ళి కాకుండానే ఉండిపోవలసొస్తుంది'' అంది. శాస్త్రి, ''పోనీ లేవే. నచ్చలేదన్నప్పుడు కట్టపెట్టటం ఎందుకు? నచ్చినవాళ్ళనే చేద్దాం'' అన్నాడు. ఆ అదును చూచుకుని శేషి, ''అలైతే రంగమన్నారుకు చెయ్యండి'' అంది. రంగమన్నారంటే పక్కింటి వ్యాపార్ల అబ్బాయి. అతడూ, శేషీ అంతకుముందు కూడబలుక్కునే ఉన్నారట! 'నా కభ్యంతరమేమిటి' అంటూ శాస్త్రి ఆ శుభకార్యం కానిచ్చేశాడు. కాకినాడలో సరోజకి మాత్రం మళ్ళీ పెళ్ళి ఇంకా కాలేదు.

''ఏమండీ, మీ రావుబావ అలా ఊరుకున్నాడు?'' అంది శాస్త్రితో, అతని భార్య.

''తగిన సంబంధం దొరికి ఉండదు. చదువుకున్న పిల్లాయిరి, అన్నివిధాలా నచ్చాలి.'' అన్నాడు శాస్త్రి.

మరో రెండుసంవత్సరాలు గడిచాయి. సరోజకి పెళ్ళి కాలేదు.

శాస్త్రియింట ఓ పేచీవచ్చి, అతణ్ణి ఓ వూపు ఊపింది.

అతని పెద్దకొడుకు పెళ్ళి చేసుకుంటానన్నాడు. రాజమండ్రి కాలేజీలో తనతో బి. ఏ. చదువుతూన్న కమలకుమారిట పెళ్ళికూతురు. నాయుళ్ళపిల్ల. శాస్త్రిగుండె గతుక్కుమంది. "వాళ్ళకీ మనకీ ఆహార విహారాల్లో ఎంతో భేదం ఉంటుంది. ఇబ్బందిపడిపోతాం; వద్దు" అనేశాడు. కొడుకు చిన్నబుచ్చుకుని చక్కాపోయాడు. నాలుగురోజులు గడిచాయి. ఐదోరోజున కొడుకుని పిల్చి శాస్త్రి, "సాధక బాధకాలన్నీ బాగా ఆలోచించుకుని, ఫరవాలేదని తోస్తే చేసుకో. నా అభ్యంతరం లేదు" అన్నాడు. ఆ సాధక బాధకాలేవో ఆ వధూవరులు ఇదివరకే ఆలోచించుకున్నారు. మరో పదిహేనురోజులకి రిజిస్ట్రి మేరేజి అయింది.

కాకినాడలో సరోజకిమాత్రం మళ్ళీ పెళ్ళి కాలేదు.

బెజవాడలో శాస్త్రికి జబ్బుచేసింది. జబ్బు అంటే మరేం లేదు. జ్వరం కాసింది. తగ్గిపోతుందనే అనుకున్నారంతా. కాని తగ్గలేదు. నాలుగోరోజున మాట్లాడుతోనే పోయాడు.

ఆ ఉత్తరం చూసుకున్న రావుకి శాస్త్రిజీవితమంతా ఓమాటు కళ్ళఎదుట కొచ్చింది. "ఎంత చొరవచూపేడు శాస్త్రి? నేనేం చేశాను? కబుర్లు చెప్పేను! కోతలు కోశాను! నా కబుర్లన్నీ అతనిలో కార్యరూపం దాల్చేయి! 'పిలక బావ' అనికదూ ఎగతాళి చేసేవాణ్ణి! చిగురిదాకా పిలకజుట్టే శాస్త్రిది. నా కబుర్లూ, క్రాపింగులూ ఏమిటి లాభం? ఒక్క పిల్లకి మళ్ళీ పెళ్ళి చెయ్యటానికి సాహసించలేకపోయాను! శాస్త్రి బావ కాదు చచ్చిపోత! నేనే పోయాను! రావే చచ్చిపోయాడు!"